గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి : అదనపు కలెక్టర్

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జూలూరుపాడు, ఆగస్టు 5: వర్షాలు అధికంగా కురుస్తున్న క్రమంలో గ్రామాల్లో ఎక్కడా నీరు నిల్వ కుండా జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి రోజూ పారిశుధ్య పనులను చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు గ్రామ పంచాయతీల్లో జరిగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని పనులను పరిశీలించారు. ఎంపీవో తులసీరామ్, కార్యదర్శులు హరిబాబు, అశోక్ ఉన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం నిరంతర ప్రక్రియ

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

ఇల్లెందు రూరల్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిరంతర ప్రక్రియలా కొనసాగాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో విద్యాచందన అన్నారు. సోమవారం సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి హాజరైన ఆమె ఉద్యోగులు, సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలను స్వచ్ఛదంతోపాటు పచ్చదనం ఉట్టిపడేలా చూసుకోవాలన్నారు. అనంతరం టీటీడబ్ల్యూఆర్ఆర్‌సీలో శ్రమదానం చేశారు. జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, టీటీడబ్ల్యూఆర్ఆర్‌సీ ప్రిన్సిపాల్ మాధురి, ఏపీవో శంకర్, కార్యదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

చంద్రుగొండ ఆసుపత్రి తనిఖీ

చంద్రుగొండ, ఆగస్టు 5: స్థానిక ప్రభుత్వాసుపత్రిని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ భాస్కర్‌నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు. ఆసుపత్రిలో కరెంటు వైరింగ్ సరిగ్గా లేదని, తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని అక్కడి అధికారి చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో ఆస్పత్రిని డీఎంహెచ్‌వో పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చర్ల, ఆగస్టు 5: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని మా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందన్నారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి : ఎఫ్‌డీవో

జూలూరుపాడు, ఆగస్టు 5: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ అధికారి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయంలో సోమవారం అటవీశాఖ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఫారెస్ట్ అధికారులు సురాబీ, హన్మంతు, మల్లయ్య, సలీం, రేఖ, విజయ, శ్రీలత, అనిత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెట్లు పతకాలు సాధించాలి

పాల్వంచ, ఆగస్టు 5 : జాతీయస్థాయిలో అథ్లెట్లు పతకాలు గెలుపొందాలని టీడీపీ నాయకుడు కనగాల అనంతరాములు అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అథారిటీ గ్రౌండ్స్‌లో జరుగుతున్న జిల్లా సీనియర్ అథ్లెటిక్స్ ఎంపికలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల్వంచలో నూతనంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రానున్న రాష్ట్ర, జాతీయపోటీల్లో పతకాలు గెలుపొంది జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలపాలని తెలిపారు. ప్యారిస్ ఒలంపిక్స్‌లో అథ్లెట్లు భారతదేశానికి మరిన్ని పతకాలు గెలవాలని కోరారు. జిల్లా అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీ పీడీ శ్వేత, ఈఎంఆర్ స్కూల్ పీఈటీ రజనీకాంత్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ఉక్కుపాదం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్, రైల్వేస్టేషన్ మేనేజర్

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 5 : మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతోందని త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితోజు శివప్రసాద్ అన్నారు. సోమవారం కొత్తగూడెం రైల్వేస్టేషన్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను అంటించారు. రైల్వేస్టేషన్ మేనేజర్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని తెలిపారు. 'చేయి చేయి కలుపుదాం.. మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోరం

జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణే మానవాళికి ప్రథమ కర్తవ్యమని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల చుట్టూ పచ్చదనంతో పాటు స్వచ్ఛదనం ఉండేలా చూసుకోవాలన్నారు. – నమస్తే నెట్‌వర్క్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

పేరు మార్పు

అయిలూరి వరలక్ష్మీ (పాత పేరు), భర్త : అయిలూరి లక్ష్మీనర్సిరెడ్డి, నివాసం : ఇ.నెం. 4-114, కుర్నవల్లి గ్రా॥, తల్లాడ మం॥, ఖమ్మం జిల్లా అను నేను నాపేరు ను కామసాని వరలక్ష్మీ (కొత్త పేరు) గా మార్చుకొనుచున్నాను.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్వచ్ఛదనం- పచ్చదనం మనందరి బాధ్యత

కలెక్టర్ జితేష్ వి పాటిల్

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం ఈ నెల 9వ తేదీ వరకు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రజలతో కలిసి మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, ప్రసాద్, రవిబాబు, రవికుమార్, అర్జున్‌రావు, రామకృష్ణ, సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి, ఆగస్టు 5: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌కు ఎమ్మెల్యే కోరం కనకయ్య విన్నవించారు. సోమవారం మండలంలో 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో పాల్గొని సులానగర్‌లో మునగ నర్సరీని పరిశీలించి వెళ్తున్న క్రమంలో రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిసారు. మండలంలో తాత ముత్తాతల దగ్గర నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ పథకల విషయంలో రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ మౌనిక, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీందర్‌రావు, వైస్‌ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీలు బానోత్ సరోజిని, బానోత్ పూర్ణ, సులానగర్ మాజీ సర్పంచ్ అజ్మీర బుజ్జి, నాయకులు కోరం సురేందర్, శివ, భద్రు, శంకర్, గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రిత ఆత్మహత్యాయత్నంపై విచారణ

అధ్యాపకులను విచారిస్తున్న ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజు

బూర్గంపహాడ్, ఆగస్టు 5: భద్రాచలం గిరిజన గురుకులంలో జూలై 31న ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అశ్రిత అనే విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనపై గురుకులం కళాశాల అధ్యాపకులను ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ జనరల్ డేవిడ్‌రాజు సోమవారం విచారణ చేపట్టారు. తొలుత అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగుల అటెండెన్స్, రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్, స్టాఫ్‌తో ప్రత్యేకంగా సమావేశమై కళాశాల నిర్వహణకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం దుమ్ముగూడెం మండలం మారేడుబాకకు వెళ్లి అశ్రితతో తల్లి సమక్షంలో కౌన్సిలింగ్ ద్వారా నచ్చచెప్పడం జరిగిన ఘటన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఆశ్రిత కేవలం ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అర్థంకాక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, ఆమెకు పూర్తిస్థాయిలో కౌన్సిలింగ్ ఇచ్చి కళాశాలలో చేరడానికి సలహాలు, సూచనలు ఇచ్చామనని తెలిపారు. అధ్యాపకులు సమయపాలన పాటించి ఏ విషయం ఉన్నా సంబంధిత ప్రిన్సిపాల్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం నివేదికను పీవోకు అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ పద్మావతి, కళాశాల, పాఠశాల టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

ప్రజాసేవతో జన్మ ధన్యం : ఎమ్మెల్యే కూనంనేని

జడ్పీటీసీ వాసును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, ఆగస్టు 5 : నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం చేసే సేవతో జన్మ ధన్యమైనట్లేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎంపీటీసీల పదవీ కాలం మంగళవారంతో ముగియడంతో పాల్వంచ మండలంలోని జగన్నాధపురంలో సోమవారం ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. జడ్పీటీసీ, ఎంపీపీలతోపాటు ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీ మడి సరస్వతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరామ్మూర్తి, కాంపెల్లి కనకేష్, కోనేరు సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో నారాయణ, ఏవో శంకర్, పంచాయతీరాజ్ డీఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పదవులు కాదు.. మంచిపనులే శాశ్వతం

చుంచుపల్లి, ఆగస్టు 5: పదవులు శాశ్వతం కాదని, మనం చేసే మంచి పనులే శాశ్వతమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అశోక్‌కుమార్ అధ్యక్షతన ఎంపీటీసీలు, ఎంపీపీలకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు ఉన్నా లేకున్నా ప్రజాక్షేత్రంలో పని చేయాలని సూచించారు. అన్నారు. జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ బదావత్ శాంతిను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పదవులతో పనిలేదు : ఎమ్మెల్యే తెల్లం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం

ఎంపీటీసీలు, ఎంపీపీలుగా మళ్లీ పోటీచేసి గెలిచి ప్రజా ప్రతినిధులుగా అనుభవంతో కూడిన సేవలు అందించాలని ఎమ్మెలే వెంకట్రావు అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం పూర్తయిన సందర్భంగా జరిగిన వీడ్కోలు సన్మానసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీపీ గీద కోదండరామయ్య, ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మొగిలి శ్రీనివాసరావు, ఎంపీడీవో కే ఈదయ్య అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 5 : తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని అంగన్‌వాడీ టీచర్ బానోత్ జ్యోతి అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని గట్టుమల్ల పంచాయతీ గంగమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను టీచర్ వివరించారు. ఇంటింటికీ తిరిగి బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ రూరల్, ఆగస్టు 5 : పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పంచాయతీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. జగన్నాధపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు వారు వినతి పత్రం అందించారు.

1969 నాటి అమరులకు నివాళి

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 5: కొత్తగూడెం పట్టణంలో 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో పోలీసుల కాల్పుల్లో అమరులైన దస్తగిరి-రాంచందర్‌లకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నాటి ఉద్యమకారుల సంఘం నాయకులు నివాళులర్పించారు.

ఆటో బీభత్సం.. యువకుడికి గాయాలు

రామవరం, ఆగస్టు 5: మద్యం మత్తులో వాహనాన్ని నడిపి ఎదురుగా ఉన్న వాహనాలను ఢీ కొట్టడమే కాకుండా ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... రుద్రంపూర్‌లో నివాసం ఉండే ఆటోడ్రైవర్ జి.కిషన్ ఉదయం రుద్రంపూర్ నుంచి తండా వైపు మద్యం మత్తులో ఆటోను నడుపుకుంటూ వెళ్తూ ఎస్‌బీఐ సమీపంలో మూడు బైక్‌లను ఢీకొట్టి గౌతంపూర్ నుంచి ఏరియా వర్క్‌షాప్‌లో అప్రంటిషిప్ చేస్తూ డ్యూటీకి వెళ్తున్న సంగం లలిత్‌కుమార్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో లలిత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలించగా ముఖంపై తీవ్రమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. లలిత్‌కుమార్ ఏరియా వర్క్‌షాప్‌లో అప్రంటిషిప్ చేస్తున్నాడు. క్షతగాత్రుడి తండ్రి కరుణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్య

సారపాక, ఆగస్టు 5: గోదావరి నదిలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సారపాకలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక మేడేకాలనీకి చెందిన భూక్యా శైలజ (20) గాంధీనగర్ ఒడియా క్యాంప్‌కు చెందిన గణేష్‌తో ప్రేమవివాహం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇంట్లో కుటుంబ కలహాల నేపథ్యంలో మధ్యాహ్నం భద్రాచలం బ్రిడ్జి వద్దకు వెళ్లి శైలజ గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం, ఆగస్టు 5: మండలంలో సుమారు రూ.కోటి అభివృద్ధి నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం స్థానిక రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రూ.40 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీవో గంటా వరప్రసాద్, తహసీల్దార్ స్వర్ణ, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ షరీపుద్దీన్, ఎస్‌కే ఖదీర్, ఎంపీటీసీలు కమటం నరేశ్, ఏనిక రవిబాబు, బేతం రామకృష్ణ, నాయకులు ఓరుగంటి భిక్షమయ్య, ఓరుగంటి రమేష్‌బాబు, బండి సాగర్ పాల్గొన్నారు.

ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కమిటీ ఎన్నిక

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 5 : ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. పాత పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ జిల్లాస్థాయి సమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్కే అమీరుద్దీన్, సంపత్‌కుమార్ ఎంపికయ్యారు. సమావేశంలో ఉపాధ్యాయులు నాగరాజశేఖర్, సంగమేశ్వరరావు, ప్రసాద్, శంకర్, శ్రీనివాస్, యశోద, శైలజ పాల్గొన్నారు.

విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించాలి

- డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 5 : విద్యార్థులను సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పాతకొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

బూర్గంపహాడ్, ఆగస్టు 5: ద్విచక్రవాహనంపై అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కుక్కునూరు మండలం సీతారామనగరానికి చెందిన రావుల రాజేష్ ద్విచక్రవాహనంపై వస్తుండగా అనుమానం రావడంతో ఆ వాహనాన్ని ఎస్సై విజయలక్ష్మి ఆపి తనిఖీలు నిర్వహించారు. వాహనంలో 4.50 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తిని విచారించగా మల్కాన్‌గిరి నుంచి వస్తున్నట్లు తెలిపాడు. గంజాయి ప్యాకెట్లతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అశ్వాపురం మండలంలో.. గంజాయి స్వాధీనం

అశ్వాపురం, ఆగస్టు 5: వంట గదిలో గిన్నెల కింద ఉన్న గంజాయిని పోలీసు కుక్క (గ్రేసీ) వాసన చూసి పట్టించిన ఘటన అశ్వాపురంలోని చవిటిగూడెం కాలనీలో సోమవారం చోటుచేసుకున్నది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అశ్వాపురంలోని చవిటిగూడెం కాలనీ పక్కనే సంత నిర్వహిస్తుండగా పోలీసులు జాగిలం (గ్రేసీ)తో తనిఖీలు చేపడుతున్నారు. ఇదే సమయంలో సమీపంలో ఉన్న పార్వతమ్మ అనే మహిళ తన వంటగదిలో గిన్నెల కింద దాచి ఉంచిన గంజాయిని జాగిలం పసిగట్టి కిలో గంజాయిని పట్టించిందని సీఐ తెలిపారు. పార్వతమ్మను అదుపులోకి తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతిరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గంజాయిని నిర్మూలిద్దాం..

ఆటోకు గోడ పత్రాలను అతికిస్తున్న పోలీస్ సిబ్బంది

కరకగూడెం, ఆగస్టు 5: 'చేయిచేయి కలుపు దాం గంజాయిని నిర్మూలిద్దాం' అంటూ సోమవారం కరకగూడెం పోలీస్‌లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరకగూడెం బస్టాండ్ ఆవరణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ యువత గంజాయికి బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి సేవించిన రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైసుమిల్లుపై నుంచి పడి యువకుడికి గాయాలు

కరకగూడెం, ఆగస్టు 5: రైసుమిల్లుపై నుంచి పడి యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన పోగు విశ్వతేజ తన తండ్రితో కలిసి రైసు మిల్లు పనులు చూసుకుంటున్నాడు. రైసు మిల్లు పైన మరమ్మతులు చేస్తుండగా అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు కరగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

బూర్గంపహాడ్, ఆగస్టు 5: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ముత్తంగి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సరోజిని వృద్ధాశ్రమంలో అన్నదానం

బూర్గంపహాడ్, ఆగస్టు 5: భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టీ రత్నం పెద్దకర్మ సందర్భంగా అన్నదానం చేశారు.

ఐటీడీఏ రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

బూర్గంపహాడ్, ఆగస్టు 5: కారు ప్రమాదంలో తీవ్రగాయాలై కాలు పోగొట్టుకున్న పెనుబల్లి సతీష్‌కుమార్ వైద్యం నిమిత్తం భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ సోమవారం గిరిజన దర్బార్‌లో బాధితుడి భార్యకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25వేల చెక్కు అందజేశారు. దమ్మపేట మండలం కొడిశెల గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ కారు ప్రమాదంలో కాలు విరిగిపోయిందని, వైద్యం చేయించుకునేందుకు ఆర్థికస్థోమత లేకపోవడంతో కుటుంబసభ్యులు గిరిజన దర్బార్‌లో దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన పీవో ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేశారు.

ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 5: హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచణారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం ఈ నెల 8వ తేదీన కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధులను 8341405102, 9010926721 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రేపు వృత్తి శిక్షణ పొందిన వారికి పరీక్షలు

రామవరం, ఆగస్టు 5 : ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణ పొందిన మహిళలకు ఈ నెల 7వ తేదీన ఆర్‌సీవోఏ క్లబ్ రుద్రంపూర్‌లో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం శాలెంరాజు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

'కార్మికులకు న్యాయం చేయండి'

రామవరం, ఆగస్టు 5 : సింగరేణి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీనియర్ టెక్నీషియన్ల ఫోర్మెలను కాదని జూనియర్‌లను డిప్యూటేషన్ల మీద సర్ఫేస్‌లో అవకాశం ఇవ్వడం సరికాదని, తమకు న్యాయం చేయాలని పీవీకే 5 షాఫ్ట్ గని కార్మికులు కోరారు. ఈ మేరకు గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, పిట్ ఇంజినీర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

సీతారంపురంలో వైద్యశిబిరం

కరకగూడెం,ఆగస్టు 5: మండలంలోని సీతారాంపురం గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మధు 69 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ముగ్గురిని జ్వరపీడితులుగా గుర్తించారు. ఇంచార్జీ ఎంపీడీవో దేవవరకుమార్ మాట్లాడుతూ జ్వర పీడితులు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

ఇల్లెందు రూరల్, ఆగస్టు 5: మండల పరిధిలోని సీఎస్‌పీ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఏకరూప స్కూల్ యూనిఫాంలను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 5: విద్యుత్తు షాక్ తగిలి యువకుడు తీవ్రగాయాల పాలైన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరారం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన సతీష్ కాంట్రాక్ట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడన్నారు. కొమరారం ప్లాంటేషన్ వద్ద విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతుండడంతో సతీష్‌తో కలిసి వాటిని సరిచేసే ప్రయత్నంలో కరెంటు షాక్‌కు గురయ్యాడని తెలిపారు. సతీష్‌ను కొమరారం పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇల్లెందుకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో సతీష్‌ను ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్ళారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ శిబిరం

జూలూరుపాడు, ఆగస్టు 5: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న దివ్యాంగుల బస్‌పాస్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతుల కోసం బీఆర్ఎస్ వాట్సాప్ హెల్ప్‌లైన్

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 5: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అర్హత కలిగి రుణమాఫీ జరగని రైతులు బీఆర్ఎస్ వాట్సప్ హెల్ప్ లైన్ నెంబర్ 8374852619కు ఫిర్యాదు చేయాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. అర్హులై ఉండి ఇప్పటిదాక రూ.లక్ష, రూ.లక్షన్నరలోపు రుణమాఫీ కానీ రైతులు హెల్ప్‌లైన్ నెంబర్‌కు పూర్తి వివరాలు అందించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 5: అశ్వారావుపేట మేజర్‌పంచాయతీ కార్యదర్శిగా కోటమర్తి శ్రీరామ్మూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కార్యదర్శి గజవెల్లి హరికృష్ణ బదిలీపై వెళ్ళడంతో దమ్మపేట మండలం సీతారామపురం కార్యదర్శిగా ఉన్న శ్రీరామ్మూర్తి ఇక్కడకు వచ్చారు. శ్రీరామ్మూర్తికి ఎంపీవో ప్రసాదరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీచేయాలి

బూర్గంపహాడ్, ఆగస్టు 5: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో లేని కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ ఉదయ్‌కుమార్‌కు సీపీఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు.

8న పంచాయతీ కార్మికుల ఒకరోజు దీక్ష

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 5: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన చేపట్టిన ఒక రోజు దీక్షను జయప్రదం చేయాలని పంచాయతీ కార్మికుల మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటప్పయ్య, నర్సింహరావులు పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీవో ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు.

'ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి'

దమ్మపేట, ఆగస్టు 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం దమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేని రూ.2 లక్షల రుణ మాఫీ చేయకుండా కొర్రీలు పెట్టి రైతులను గందరగోళం చేస్తుందని దుయ్యబట్టారు. మహాలక్ష్మి పథకంలో పాటు సామాజిక బద్రత ఫించన్లను రూ.4 వేలకు పెంచాలని అన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

చంద్రుగొండ, ఆగస్టు 5: సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని మాలమహానాడు నాయకులు ఆరోపించారు. సోమవారం ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యకర్తలు నిరసన చేపట్టారు. రెండు దళిత కులాల మధ్య అంతరం పెంచేలా తీర్పు ఉందని, ఈ తీర్పును పునఃసమీక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.